క్లుప్తంగా

నేటి నుంచి జీపుజాత

రాజవొమ్మంగి: అంగన్‌వాడీల సమస్యల పరిష్కారం, ఐటీడీఏ పరిరక్షణ కోసం డివిజన్‌లో ఈనెల 25, 26, 27 తేదీల్లో జీపు జాతా నిర్వహిస్తున్నట్టు అంగన్‌వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి బి.నిర్మల ఒక ప్రకటనలో తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తల ఉద్యోగ భద్రత, పనికి తగిన వేతనం తదితర డిమాండ్లు చేస్తూ కార్యక్రమం చేపడుతున్నామన్నారు. ఇందులో భాగంగా 25న రాజవొమ్మంగి నుంచి ప్రారంభమవుతున్న ఈ జీపు జాతా 26న– అడ్డతీగల, వై. రామవరం, గంగవరం మీదుగా 27న దేవీపట్నం, మారేడుమిల్లి మీదుగా రంపచోడవరం చేరుకుంటుందన్నారు. జీపుజాత కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

27న మండల సమావేశం

రాజవొమ్మంగి: మండల సర్వసభ్య సమావేశం ఈనెల 27న నిర్వహించనున్నట్టు ఎంపీడీవో ఎల్.యాదగిరీశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ గోము వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో మంగళవారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి జరగనున్న సమావేశంలో వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించిన అన్ని అంశాలపై సమీక్ష జరగనున్నట్టు పేర్కొన్నారు. అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలని కోరారు.

బోనాల పండగకు ఏర్పాట్లు

అడ్డతీగల: వేటమామిడి శివారులో ఉన్న మర్రి రేణుకా ఎల్లమ్మ బోనాల పండుగ మహోత్సవాన్ని ఆదివారం నిర్వహించేందుకు సన్నద్ధం చేసినట్టు ఆలయ అభివృద్ధి కమిటి ప్రతినిధులు తెలిపారు. అమ్మవారికి బోనాలు సమర్పణకు మహిళలు భారీ సంఖ్యలో రానున్న దృష్ట్యా అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేశామన్నారు. బోనాల ఊరేగింపు, అమ్మవారికి బోనాల సమర్పణ అనంతరం చిన్న మస్తాదేవికి హోమం, ప్రత్యేక పూజలు తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. భక్తులు భారీ సంఖ్యలో తరలిరావాలని కోరారు.

ఆత్మీయ వీడ్కోలు


విజయకుమారిని సన్మానిస్తున్న గ్రామస్తులు

సాక్షి, పాడేరు: చింతలవీధి పంచాయతీలోని నడిమివీధి పాఠశాలకు చెందిన స్కూల్ అసిస్టెంట్ కె.విజయకుమారికి అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం ఉన్నత పాఠశాలకు బదిలీ అయింది. నడిమివీధిలో శనివారం జరిగిన కార్యక్రమంలో ఆమెకు ఉపాధ్యాయులు తదితరులు ఘనంగా సన్మానించారు. ఆమె చేసిన సేవలను కొనియాడారు. ఉపాధ్యాయులు కొండలరావు, విజయభాస్కర్, తల్లిదండ్రుల కమిటీ ప్రతినిధులు మత్స్యకొండ, ఈశ్వరి, దొమయంతి, ధర్మావతి పాల్గొన్నారు.

పార్టీ మరింత బలోపేతానికి కృషి


గణబాబు

చింతపల్లిరూరల్: పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి ఆదేశాల మేరకు పాంగి గణబాబుని చింతపల్లి మండల కన్వీనర్‌గా నియమించినట్టు జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన అరుకు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శిగా పనిచేసేవారు. ఈ సందర్భంగా గణబాబు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి ఆయన వంతు కృషి చేస్తానని తెలిపారు.

రోడ్డు పనుల పరిశీలన


వలస గ్రామంలో రోడ్డు పనులను పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు

వై.రామవరం: మండలంలో నిర్మిస్తున్న సీసీ రోడ్లు నాణ్యతతో నిర్మించుకోవాలని స్థానికులకు ఎంపీపీ కడబాల ఆనందరావు సూచించారు. మండలంలోని చింతలపూడి పంచాయతీ వలస గ్రామంలో సుమారు రూ.5 లక్షలు గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్డును ఆయనతో పాటు జెడ్పీటీసీ సభ్యురాలు కర్ర వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ ముర్ల జోగిరెడ్డి తదితరులు శనివారం పరిశీలించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు.

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు


గిరిజనులకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి

చింతపల్లిరూరల్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వలన ప్రజలంతా సంతోషంగా ఉన్నారని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి అన్నారు. అన్నవరం పంచాయతీ పరిధిలో కూర్మన్నపాకలు, కొత్తూరుబయలు, గాలిపాడు, అన్నవరం గ్రామాల్లో శనివారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇందులో భాగంగా ఆయా గ్రామాల్లో 252 గడపలను ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి సందర్శించారు. ఇంటింటికీ వెళ్లి యోగక్షేమాలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూ, దేశానికి ఆదర్శంగా నిలిచారన్నారు. పార్టీలకతీతంగా, పారదర్శకంగా అన్ని వర్గాలకు ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలుచేస్తోందన్నారు. జగనన్న ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల చెంతకే ప్రభుత్వ సేవలు అందుతున్నాయని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామస్తులు పలు సమస్యలను ఎమ్మెల్యేకు తెలియజేయగా, వాటిని త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఎంపీపీ అనూషాదేవి, జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షురాలు పుష్పలత, అన్నవరం సర్పంచ్ పాంగి సన్యాసిరావు, ఎంపీటీసీ సభ్యుడు కొర్ర సూరిబాబు, మండల పార్టీ అధ్యక్షుడు మోరి రవి, మండల కన్వీనర్ పాంగి గణబాబు పాల్గొన్నారు.

జోరందుకున్న ఉపాధి పనులు

సాగునీటి కాలువల్లో పూడికతీత, గండ్లు పూడ్చివేత పనులు


అప్పలరాజుపేట వద్ద పడిన గండ్లను పూడ్చుతున్న ఉపాధి వేతనదారులు

రాజవొమ్మంగి: మండల వ్యాప్తంగా ఉపాధి హామీ పథకం పనులు జోరందుకున్నాయి. గ్రామాల్లోని సాగునీటి కాలువ పూడికతీత, గండ్లుపూడ్చే పనులు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా స్థానిక వట్టిగెడ్డ రిజర్వాయర్ పంట కాలువకు ఉపాధి హామీ పనులతో అప్పలరాజుపేట వద్ద గండ్లు పూడ్చే పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈ పంటకాలువ దాదాపు పదేళ్లుగా మరమ్మతుకు నోచుకోక ఆయకట్టు శివారు భూములకు సాగునీరు అందని పరిస్థితి ఉందని పలువురు రైతులు చెబుతున్నారు. దీంతో రైతుల డిమాండ్ మేరకు పలు గండ్లను ఉపాధి పనుల్లో గుర్తించగా గత రెండు రోజులుగా ఆ పనులు జోరుగా సాగుతున్నాయి. ఈ పంటకాలువకు ఎక్కడిక్కడ గండ్లు పడి సాగునీటి పంపిణీలో సమస్యలు తలెత్తిన నేపథ్యంలో ఈ పనులు దాదాపు ఆరు గ్రామాలకు చెందని రైతాంగానికి కొంత ఉరట ఇస్తాయని భావిస్తున్నారు. ఉపాధి పనుల్లో సంభందిత అధికారులు ఇటువంటి ఉపయోగకరమైన పనులను చేపడితే ఎంతో మేలు జరుగుతుందని రైతులు అభిప్రాయపడుతున్నారు.

ఫ్లడ్ డ్యామేజీ పనుల్లో సాగునీటి కాలువకు మరమ్మతులు

వట్టిగెడ్డ రిజర్వాయర్ పంటకాలువ ఎడవ గట్టు శిథిలస్థితికి చేరుకోగా దీనిని ఫ్లడ్ డ్యామేజి పనులుగా గుర్తించామని స్థానిక ఉపాధిహామీ ఏపీఓ సురేష్ కుమార్ చెప్పారు. ప్రస్తుతం జోరుగా పనులు జరుగుతున్నాయన్నారు.

ముస్లింల సంక్షేమానికి కృషి


నూతన కార్యవర్గ సభ్యులు

చింతపల్లి: మండల కేంద్రంలోని మసీదులో మండల ముస్లిం కమిటీ నూతన కార్యవర్గం ఎన్నిక శనివారం జరిగింది. కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా షేక్ మీరా సాహెబ్, షేక్ నూర్ సాహెబ్, ఉపాధ్యక్షుడిగా షేక్ ఉస్మాన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్ష, ఉపాధ్యక్షులు మాట్లాడుతూ మసీద్ అభివృద్ధి, ముస్లింల సంక్షేమం కోసం కృషి చేస్తామన్నారు. పలువురు ముస్లింలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన


పెదబయిలులో బోరు పనులకు భూమిపూజ చేస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు


కూనవరంలో చేతి పంపు పనులకు భూమిపూజ చేస్తున్న ప్రజాప్రతినిధులు


జీకే వీధిలో కల్వర్టు పనులకు పూజలు చేస్తున్న సర్పంచ్ వీరేంద్రప్రసాద్

పెదబయలు: మండలంలో తాగునీటి కల్పనకు అరకు ఎంపీ గొడ్డేటి మాధవి నిధులతో ఐదు తాగునీటి బోర్లు మంజూరైనట్టు వైస్ ఎంపీపీ కొర్రా రాజుబాబు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు వంతాల ఆనందరావు చెప్పారు. మండలంలోని సీతగుంట పంచాయతీ, పెదబయలు వారపు సంత ఆవరణలోని మార్కెట్ యార్డు షెడ్ సమీపంలో బోరు ఏర్పాటుకు శనివారం భూమిపూజ చేశారు. అలాగే సీతగుంట గడ్డి కాలనీలో ఒకటి, మారుమూల జామిగుడ పంచాయతీకి మూడు బోరుబావులు మంజూరైనట్టు వారు చెప్పారు ఒక్కో బావి రూ.1.50 లక్షలతో నిర్మించినున్నట్టు పేర్కొన్నారు. ఎంతో కాలంగా సంత మార్కెట్ యార్డ్ షెడ్డు పరిసరాల్లో నీటి ఎద్దడి ఉండేదని బోరు ఏర్పాటుతో త్వరలో నీటి సదుపాయం కలుగుతుందని మండలానికి ఐదు బోర్లు మంజూరు చేసిన ఎంపీ మాధవికి స్థానికుల తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. కిముడుపల్లి సర్పంచ్ కొర్ర శోభరాణి, మాజీ సర్పంచ్ సింహాచలం, నాయకులు లక్ష్మణరావు, తమ్మన్న, అనంతరావు, రాధాకృష్ణ, రామారావు, ఏఈ కురుప్ తదితరులు పాల్గొన్నారు.

గూడెంకొత్తవీధి: మండలంలోని లకవరుపేట పంచాయతీలో నేలపాడు గ్రామానికి వెళ్లే దారిలో కల్వర్టు నిర్మాణం పనులకు సర్పంచ్ వీరేంద్రప్రసాద్ శంకుస్థాపన చేశారు. ఇప్పటివరకు సరైన రహదారి లేక గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోన్నారని, పనులు పూర్తి అయితే రహదారి నిర్మాణాన్ని మెరుగుపరుస్తామన్నారు. ఎంపీటీసీ సత్యనారాయణ, వైస్ సర్పంచ్ గంగాధర్, సచివాలయ కన్వీనర్ కె.ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

కూనవరం: తాగునీటి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ పాయంరంగమ్మ, జెడ్పీటీసీ గుజ్జా విజయ అన్నారు. మండల కేంద్రంలో స్థానిక ఎంపీటీసీ కొమ్మాని అనంతలక్ష్మి నిధులతో ఏర్పాటు చేసిన చేతి పంపు నిర్మాణ పనులకు శనివారం శంకుస్థాపన చేశారు. వారు మాట్లాడుతూ స్థానికంగా బోరు ఏర్పాటు చేసి, దాహార్తి తీర్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. మేరుకులం రాష్ట్ర డైరెక్టర్ దీకొండ గంగాధర్, సొసైటీ అధ్యక్షులు నోముల కొండలరావు, సర్పంచ్ మల్లంపల్లి హేమంత్, కొండ్రాజుపేట సర్పంచ్ కట్టం లక్ష్మి, నాయకులు గుజ్జా బాబు, కొమ్మాని మోహన్‌రావు, కొమ్మాని వీరాజు, ఉల్లూరి సాయిబాబు, డాక్టర్ కె.టి.పాల్, స్థానికులు బత్తుల నర్సింహమూర్తి, ముప్పన చందర్‌రావు, అల్లంకిరాజు పాల్గొన్నారు.

స్వార్థ ప్రయోజనాల కోసం టీడీపీ దుష్ప్రచారం


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ యువజన విభాగ జిల్లా అధ్యక్షుడు కిరణ్‌కుమార్

అరకులోయ రూరల్: టీడీపీ స్వార్థ ప్రయోజనల కోసమే ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తోందని వైఎస్సార్‌సీపీ యువజన విభాగ జిల్లా అధ్యక్షుడు ఎల్.బి.కిరణ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సుపరిపాలన, అమలుచేస్తున్న సంక్షేమ పథకాలకు ప్రజల నుంచి వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక టీడీపీ నాయకులు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారన్నారు. కుట్ర రాజకీయాలు చేస్తున్న టీడీపీకి ప్రజలు సరైన గుణపాఠం చెబుతారన్నారు. ఇకపై టీడీపీ నాయకులు తప్పుడు ప్రచారాలు చేస్తే సహించేది లేదన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ కిల్లో రాజారమేష్, వైస్ ఎంపీపీలు కిల్లో రామన్న, శెట్టి ఆనంద్, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రమేష్, నాయకులు సింహచలం, నగేష్, రాంబాబు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష సర్వే ప్రారంభం

సమస్యలపై వివరాలు సేకరణ


అరకులోయలో పథకాలపై అవగాహన కల్పిస్తున్న రంజిత్‌కుమార్, సచివాలయం సిబ్బంది


డౌనూరులో ఇంటింటికి వెళ్లి సమస్యలు తెలుసుకుంటున్న ఎంపీడీవో, సర్పంచ్, ఇతరులు


కింద్రలో జగనన్న సురక్షపై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో యాదగిరీశ్వరరావు


అడ్డతీగలలో ఇంటింటికీ వెళ్లి వివరాలు నమోదు చేస్తున్న గ్రామ వలంటీర్లు


వై.రామవరంలో అవగాహన కల్పిస్తున్న ఈవోపీఆర్డీ మధుసూధనరాజు


రేఖపల్లిలో గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న గ్రామ వలంటీర్లు తదితరులు


దేవీపట్నంలో వలంటీర్ల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీపీ కుంజం మురళీ

అరకులోయ రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమానికి సంబంధించి జిల్లా వ్యాప్తంగా గ్రామాల్లో విస్తృత అవగాహన కల్పించారు. గ్రామాల్లో సమస్యలపై ఇంటింటా సర్వే కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు కార్యక్రమంపై గ్రామ వలంటీర్లు, పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కల్పించారు. పలువురు మాట్లాడుతూ వలంటీర్లు తమ పరిధిలో ఉన్న సమస్యలను గుర్తించి నివేదిక మండల స్థాయి అధికారులకు తెలియజేయాలన్నారు. షెడ్యూల్ వారీగా సచివాలయాలను సంబంధిత అధికారుల బృందాలు సందర్శించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. అర్హులైన అందరికీ పథకాలను అందజేయడమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. షెడ్యూల్ ప్రకారం జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా 11 రకాల సేవలను పారదర్శకంగా అందించాలన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం షెడ్యూల్ ప్రకారం తుచ తప్పకుండా ఆచరించాలని ఆయన అధికారులను సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి తొలి ప్రాధాన్యం కల్పిస్తున్నట్టు చెప్పారు. ప్రతి ఇంటిని సందర్శించి వివరాలు క్రోడీకరిస్తున్న గ్రామ వలంటీర్లు, ఇతర సచివాలయ సిబ్బంది పనితీరుని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ కార్యక్రమం విజయవంతానికి కృషి చేస్తున్నామన్నారు.

– అరకులోయ మండలం చినలబుడు పంచాయతీలో సచివాలయం కన్వీనర్ రంజిత్‌కుమార్, గృహసారథులు నరసింహరావు, రఘునాథ్, పంచాయతీ కార్యదర్శి గురుమూర్తి, వీఆర్వో రుక్మిణి, వార్డు సభ్యుడు రాజ్‌కుమార్, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

హుకుంపేట: స్థానిక సచివాలయం సిబ్బంది, గ్రామ వలంటీర్లతో జెడ్పీటీసీ సభ్యుడు రేగం మత్స్యలింగం సమావేశం నిర్వహించారు. సర్పంచ్ కొప్పుల లక్ష్మయ్య, ఎంపీటీసీ సభ్యురాలు కోరాబు నాగలక్ష్మి, మండల యువజన కార్యదర్శి వెంకట్, నాయకులు ధర్మయ్య దొర తదితరులు పాల్గొన్నారు.

గూడెంకొత్తవీధి: రింతాడ సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ బొబ్బిలి లక్ష్మి, రాష్ట్ర ఎస్టీ సెల్ కమిషన్ సభ్యుడు బొబ్బిలి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

కొయ్యూరు: డౌనూరులో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో లాలం సీతయ్య, సర్పంచ్ పొట్టిక భవాని, బూత్ కన్వీనర్ పోతురాజు, సురేష్ పట్నాయక్ పాల్గొన్నారు. రావణాపల్లిలో జరిగిన కార్యక్రమంలో చింతపల్లి ఏఎంసీ చైర్‌పర్సన్ జె.రాజులమ్మ, సచివాలయం కన్వీనర్ నాగేంద్ర, ఏఎంసీ డైరెక్టర్ అచ్యుత్, వలంటీర్లు పాల్గొన్నారు.

అడ్డతీగల: జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ఇంటింట సర్వే కార్యక్రమం ప్రారంభమైనట్టు ఎంపీడీవో కె.బాపన్నదొర చెప్పారు.మండలంలోని 17 గ్రామ సచివాలయాల పరిధిలోనూ 99 గ్రామాల్లో సర్వే చేపడుతున్నట్టు పేర్కొన్నారు.


వై.రామవరం: స్థానిక సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో ఈవోపీఆర్డీ మధుసూధనరాజు, ఎంపీటీసీ సభ్యురాలు వీరమళ్ళ సుబ్బులక్ష్మి , సర్పంచ్ పల్లాల బాలురెడ్డి, నాయకులు గుడ్ల త్రిమూర్తులు, కరణం కనకరాజు, సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: మండలంలోని కింద్ర, లబ్బర్తి సచివాలయాల్లో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో యాదగిరీశ్వరరావు, ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, సర్పంచ్‌లు సత్యవతి, సత్యనారాయణ పాల్గొన్నారు.

వీఆర్ పురం: రేఖపల్లి సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ మాచర్ల గంగులు, సచివాలయ కన్వీనర్ ఇన్‌చార్జి బొడ్డు సత్యనారాయణ, ఎస్సీఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు చిక్కాల బాలు, మాదిరెడ్డి సత్తిబాబు, సచివాలయ కన్వీనర్ చీమల కాంతారావు, వీఆర్వో దూలయ్య , సెక్రటరీ శివప్రసాద్, వెల్ఫేర్ అసిస్టెంట్ బుచ్చిరాజు, ఏఎన్ఎం పార్వతి పాల్గొన్నారు.

దేవీపట్నం: మండలంలో జరిగిన కార్యక్రమంలో ప్రత్యేకాధికారి గిరిజన సంక్షేమ డీడీ జాన్, ఎంపీపీ కుంజం మురళీ, జెడ్పీటీసీ సభ్యురాలు సత్యవేణి, ఎంపీడీవో కె.రత్నకుమారి, తహసీల్దార్ కె.సత్యనారాయణ, సచివాలయ కన్వీనర్ కందుల బాబ్జి, వైస్ ఎంపీపీ గారపాటి మురళీకృష్ణ, గృహ సారథులు పాల్గొన్నారు.

పశు బీమాపై అవగాహన


కొర్రాలో పశు బీమాపై అవగాహన కల్పిస్తున్న పశు వైద్యాధికారి రాజశ్రీ

డుంబ్రిగుడ: పశుబీమాపై పాడి రైతులు అవగాహన కలిగి ఉండాలని పశువైద్యాధికారి రాజశ్రీ అన్నారు. కించుమండ పంచాయతీ కొసోంగుడ, కించుమండ గ్రామాల్లో పశుబీమాపై రైతులకు శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పశువైద్యాధికారి రాజశ్రీ మాట్లాడుతూ పశువులు, మేకలు, గొర్రెలకు ప్రభుత్వం బీమా సౌకర్యం కలిప్పించిందన్నారు. పశువులు మరణిస్తే బీమా కింద నాటు పశువులకు రూ.15వేలు, గొర్రెలు, మేకలకు రూ.5వేలు పరిహారం అందుతుందన్నారు. రైతులు నష్టపోకుండా ఉండేందుకు ప్రభుత్వం ఈ బీమా సౌకర్యం కల్పిస్తుందని పశువులు, మేకలు, గొర్రెలు ఉన్న రైతులందరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పశుసంవర్ధక శాఖ సిబ్బంది త్రినాథరావు, జానకి, అనంత్‌రావు, బాలు తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం తగునా!


చిత్తడి దారిపై సీసీ రోడ్డు వేస్తున్న దృశ్యం

పెదబయలు: మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాల వద్ద చేపడుతున్న సీసీ రోడ్డు పనులు అస్తవ్యస్తంగా ఉన్నాయని పలువురు చెబుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఈ ప్రాంతంలో బురదపేరుకుపోయింది. అయితే బురద మట్టిని తొలగించకుండా రోడ్డు పనులు చేపడుతున్నారని స్థానికులు చెబుతున్నారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పనుల్లో నాణ్యత ప్రమాణాలు కొరవడ్డాయని పలువురు ఆరోపిస్తున్నారు. దీనిపై కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు ఫిర్యాదు చేస్తామని గిరిజన సంఘం నాయకుడు సన్నిబాబు చెబుతున్నారు. ఈ విషయంపై ఎంపీడీవో పూర్ణయ్య మాట్లాడుతూ పనులను ఇంజినీర్లు పర్యవేక్షించాలని, నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఆదేశించినట్టు తెలిపారు. ఈ విషయాన్ని పరిశీలిస్తామన్నారు.

ప్రభుత్వ ప్రకటన హర్షణీయం

గంగవరం: ఏజన్సీలో వైద్య ఆరోగ్యశాఖలో కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజేషన్‌పై ప్రభుత్వం తీసుకన్న నిర్ణయం హర్షణీయమని ఏజెన్సీ మెడికల్ కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం నాయకులు వీర్రాజు, శ్రీనివాస్, నాగలక్ష్మి, కళ్యాణి కొనియాడారు. ప్రత్యేక జీవో విడుదల చేసి వారికి న్యాయం చేయాలని కోరారు.

సారూ.. పట్టించుకోరూ


చిన్నతమ్మెంగుల మార్గంలో రోడ్డుకు అడ్డంగా కూలిన చెట్టు

ముంచంగిపుట్టు: మండలంలోని జర్జుల పంచాయతీ చిన్న తమ్మెంగుల గ్రామానికి వెళ్లే రహదారికి అడ్డంగా ఉన్న చెట్టును తొలగించాలని వాహనచోదకులు కోరుతున్నారు. గ్రామ సమీపంలో రోడ్డుపై ఉనన చింతచెట్టు ఇటీవల ఈదురుగాలులకు నేలకొరిగింది.రోడ్డుకు అడ్డంగా కూలడంతో రాకపోకలకు ఇబ్బంది పడుతున్నామని వాహనచోదకులు చెబుతున్నారు.

రాత్రిళ్లు ఈ మార్గంలో మరింత భయంగా ఉందని, ఏ మాత్రం ఆదమరిచినా ప్రమాదం బారిన పడక తప్పదని ఆందోళన చెందుతున్నారు. అధికారులు తక్షణమే స్పందించి కూలిన చెట్టును తొలగించి, సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

నాడు -నేడు పనులపై సమీక్ష

గంగవరం: నాడు-నేడు పనులు వేగవంతం చేయాలని ఎంఈవో-2 టి.మల్లేశ్వరరావు హెచ్ఎంలు, సీఆర్పీలను సూచించారు. స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయంలో పాఠశాలల్లో రెండో విడత నాడు-నేడు పనులపై శనివారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. మండలంలో రెండో విడతలో 15 పాఠశాలలను నాడు-నేడు పథకంలో అభివృద్ధి చేయనున్నట్టు వివరించారు. రాజుపేటలొద్ది ఎంపీపీ పాఠశాలలో రెండు తరగతి గదులు, గంగవరం గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలలో ఎనిమిది తరగతి గదులు నిర్మాణాలు జరుగుతున్నట్టు తెలిపారు. పాఠశాలల్లో జరుగుతున్న పనుల ప్రగతిని హెచ్ఎంలు వివరించారు. హెచ్ఎం సత్యనారాయణ, ఎంఎస్ కో-ఆర్డినేటర్ సురేష్‌దొర, సీఆర్పీలు విజయభాస్కర్, వెంకటలక్ష్మి, శివ, ప్రసాద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.


ఉపాధి పనులు కల్పించండి

గూడెంకొత్తవీధి: ఉపాధి పనులు కల్పించాలని గుమ్మల్లగోందిలో పలువురు కోరుతున్నారు. గ్రామంలో 60 కుటుంబాలున్నాయని, ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్నామని చెబుతున్నారు. అధికారులు స్పందించి పనులు కల్పించాలని వారు కోరుతున్నారు. ఏపీవో రామప్రసాద్ మాట్లాడుతూ సాంకేతిక సమస్య వల్ల ఉపాధి పనుల కల్పనలో ఇబ్బందులయ్యాయని, త్వరలో సమస్య పరిష్కరిస్తామని చెప్పారు.

ప్రీ ప్రైమరీ విద్యపై అవగాహన ర్యాలీ

హుకుంపేట: తడిగిరి పంచాయతీ కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శనివారం జరిగిన జన భాగీదారి కార్యక్రమంలో భాగంగా ప్రీ ప్రైమరీ విద్యపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. సర్పంచ్ పెనుమల రంజిత్‌కుమార్, ఎంపీటీసీ సభ్యుడు పరదాని భీమలింగేశ్వరరావు ర్యాలీని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అందిస్తున్న ప్రీ ప్రైమరీ విద్యను తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని, పిల్లలను పంపించాలని కోరారు. ఐసీడీఎస్ సిబ్బంది, క్లస్టర్ అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేయాలి


కేజీబీవీ ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఎంఈవో ప్రసాద్

కొయ్యూరు: ఉపాధ్యాయులు అంకితభావంతో విధులు నిర్వహించాలని కొయ్యూరు ఎంఈవోగా (ఎఫ్ఏసీ) బాధ్యతలు చేపట్టిన పనసల ప్రసాద్ అన్నారు. ఆయన శనివారం ఎంఈవోగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కస్తూర్బాగాంధీ పాఠశాలను సందర్శించారు. అక్కడ ఉపాధ్యాయులతో మాట్లాడారు. అంకితభావంతో పనిచేసి, మెరుగైన బోధన అందించాలని సూచించారు. ఇక్కడ ఎంఈవోగా పనిచేసిన బోడంనాయుడు చింతపల్లికి బదిలీ అయ్యారు.

గొయ్యితో ఇబ్బందులు



అరకులోయ: పట్టణంలోని ఎన్టీఆర్ మైదానం నుంచి శరబగుడ గ్రామానికి వెళ్లే మట్టిరోడ్డును సెప్టిక్ ట్యాంక్ నిర్మాణం కోసం తవ్వడంతో గొయ్యిగా రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని, దీంతో పాటు పైపులైన్ దెబ్బతినడంతో నీటి సరఫరా లేక అవస్థలు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు.